# ముప్పు

సీత కనపడడం లేదు!

అవును సీత కనపడడం లేదు!

ఎటు వెళ్ళినట్టు?

ఇద్దరు పిల్లలను వొదిలిపెట్టి వెళ్ళిందే!

పిల్లలు చిన్నబోయిన ముఖాలతో బిక్కుబిక్కుమంటు తిరుగుతున్నారు. వేళకు తయారు చేసేవాళ్ళు లేక బడికి కూడా పోవడం లేదు. అందరు వుండి వాళ్ళ తల్లి లేకపోయేసరికి ఆమెకోసం దిక్కులు చూస్తూవున్నారు.

ఏదో ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్న భర్త గోపాల్ మౌనంగా ఆఫీసుకు వెళ్ళివొస్తువున్నాడు. ఆమె వెళ్ళిన రెండు మూడు రోజులు వెతుకుతూనే వున్నాడు. జాడ కనిపించలేదు. తల్లిగారింటికి పోయి అడుగగ రాలేదన్నారు. అక్క చెల్లెండ్ల ఇండ్లకు పోయి అడిగితే అసలే రాలేదన్నారు. అంతేకాదు, అట్లెట్ల పోతదని నిలదీశారు. అంతేకాదు మా బిడ్డను ఏంచేసావు. చంపేసావా? ఏ బావిలో నైనా నెట్టేసావా? అంటూ నిలదీస్తున్నరు ఆమె తల్లి తండ్రి, అక్కచెల్లెండ్లు అందరు.

కాదు లేదు అని కన్నీరు పెట్టుకున్నా వినటం లేదు. కాపురం చేస్తున్న టౌనుకొచ్చి అందరితో ఆరాతీసారు. ఏ సమాచారం దొర్కలేదు. ఇంటికొచ్చిన అత్తమామలకు చేతులు జోడించి నాకు ఏ పాపం తెలియదన్నాడు. అయినా వాళ్ళ అనుమానం తీరడంలేదు. ఇంట్లో వుండాల్సిన ఇల్లాలు ఊళ్లోనే లేనపుడు ఎవరికైనా అనుమానమే. అంతో ఇంతో చదువుకున్నది గదా అంత బాధకలిగితె తల్లితండ్రులకు ఉత్తరం రాయొచ్చుకదా. అదిచేయలేదు. దిక్కుతోచని ఆలోచనలతో సతమతమౌతున్నాడు గోపాల్.

"కట్నం చాలదు అన్నావా?" మామగారి ప్రశ్న.

గోళ్ళు గిళ్ళుతూ నిలుచున్నాడు గోపాల్.

"అప్పులు చాల అయినయి అన్నావా?" అత్తగారి ఆరాటం.

'అన్నాను' అన్నట్టు గోపాల్ తలవూపాడు.

"మీ తల్లిగారిని అడిగి తెమ్మన్నావా" ప్రశ్నమీద ప్రశ్న.

గోపాల్ మాట్లాడలేదు. సంసారం సాగక అప్పయినందుకు అనుకున్నాం.

"ఎందుకు మాట్లాడుతాడు. అన్నది నిజమేకదా" అన్నాడు మామ ముఖాన్ని మరో పక్క తిప్పుకుంటూ గోపాలు కళ్ళలో నీరు తిరుగుతుంది. సీత ఇంతపని చేస్తదని కలలో కూడా ఊహించుకోలేదు.

అదిచూసి పిల్లలు తండ్రిని చెరోవైపు అల్లుకుని ఏడుస్తువున్నారు. అరగంటలో ఆ ఇంట్లో ఇంటిముందు జనం గుంపు అయింది. వాళ్ళల్లో వాళ్ళే ప్రశ్నించుకుంటున్నారు. వాళ్లే జవాబులు చెప్పుకుంటున్నారు. ఏమోమో ఆరాలు, ఏమోమో సమాచారాలు, ఏవేవో అనుమానాలు. చిక్కుల్లో చిక్కిన గోపాల్ బిక్క ముఖం వేసాడు.

'పోయిన రోజె, అదె మూడు రోజుల కింద సినిమా దగ్గర కనిపించిందని, తాను దగ్గర్కి వెళ్లేసరికి అక్కడ లేదని' ఒకావిడ తనవంతు సమాచారం అందించింది.

'మరుసటి రోజు దావఖానలో కనిపించిందని' మరోకావిడ ఒక్కరిద్దర్కి మాత్రమే వినిపించేటట్టు మెల్లగ చెప్పి ఏం తెలియనట్టు నిలుచుంది.

"ఎందుకు దించుకోవడానికా" అని అడిగింది అంతకంటె మెల్లగ.

"దించుకోవడానికో ఫామిలి ప్లానింగ్ ఆపరేషన్ కోసం" అంది మెల్లగ దావకాన గురించి చెప్పినామెతో మరొకామె, ఆమెకు నలబైలోపు వుంటాయి.

"ఎప్పుడో చేయించుకుంది" అంది అది విన్న ఇంటి పక్క ఈశ్వరమ్మ.

"పిల్లల సంచి తీయించుకోవడానికి పోయిందో ఏమో"దావఖాన ప్రస్తావన తెచ్చినావిడ తను చెప్పింది నిజం అని నమ్మించడానికి చేసే ప్రయత్నమది. అట్లా కొందరుంటారు. వాళ్ళ తత్వమే అంత.

"అట్లా ఒకవేళ పోతే మొగనికి చెప్పదా?" అంది ఈశ్వరమ్మ.

"ఏం చెప్పుతుంది అప్పులకుప్పయి కూర్చుంటే" అంది చిట్టీలు వేసే మారమ్మ, తన దగ్గర నెలచిట్టి వేసేదని నలుగురికి తెలిసేటట్లు.

"అప్పు అయితే ఇల్లిడిసి పోతే తీరుతుందా?" అంది వీళ్ళ సంబాషణలవైపు చెవిపెట్టిన నడీడు మనిషి.

"పోయినందుకు సంపాదన సాగాలెకాని ఎంతప్పయిన తీర్చొచ్చు" అంది ఓ కన్ను సగం మూసి తెరుస్తు మొదట సన్నగా వుండి భర్తను వదిలినంక బాగా వల్లుచేసింది. ఆమె పళ్ళు కాపాడితే వళ్ళు ఇల్లును కాపాడుతుంది.

"అంతేకదా" అంది మరో ప్రౌఢ నవ్వును నాలుగు రకాలుగ చూపిస్తూ. నవ్వు నలుగురిని దగ్గర్కి చేర్చుతుందని ఆమెకు తెలుసు.

ఇట్లాగె అప్పుచేసి తప్పతాగొచ్చి నానా బాధలు పెడుతున్నా భర్తకు విషంపెట్టి

చంపిన సావిత్రి ప్రస్తుత సంఘ సేవకురాలు. ఈమె చాలామందిలో కలెగొలుపుగా తిరుగుతుంది. మరెంతో మందిలో సరదాగా వుంటుంది. అక్కడికొచ్చిన వాళ్ళు ఎవరికి తోచింది వాళ్ళు అంటూవున్నారు ఎవరు అన్నా జరిగిన సంఘటనకు తమ అనుభవాన్ని జోడించి బేరీజు వేసుకుని అంటువున్నారు. సీత తన భర్తతో కలిసి కాపురం చేసుకుంటూ వుంటె ఓహో మహా పతివ్రత అని దెప్పిపొడిచింది వాళ్లే ఇప్పుడు తమ గుంపులో చేరిందని అనుకుంటున్నారు.

అంతవరకు మౌనంగా వున్న గోపాల్, గోపాల్ అత్తమామ ఒక్కసారె మౌనాన్ని బద్దలు గొట్టినట్టుగా "చూడు గోపాలు మా పరిస్థితిలో నీవున్నా బిడ్డలేని ఇంటికొచ్చిన అల్లున్ని అనుమానించక తప్పదు" అన్నాడు మామ.

అత్త మౌనంగా పిల్లలను దగ్గరికి తీసుకుని తల నిమురుతూ దుఃఖించసాగింది.

గోపాల్ మౌనంగా నేలను చూస్తువున్నాడు ఏంమాట్లాడాలో తోచక.

"పోలీసులకు కంప్లెయింట్ ఇవ్వక తప్పదు" అన్నాడు మామ.

"సరె" అన్నాడు గోపాల్. మామ ఆ మాట అనేసరికి, ఆయన కళ్లలోకి చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.

"ఇద్దురుగాని ఈ ఒక్కరోజు చూద్దాం. ఏ స్నేహితురాలు ఇంటికి వెళ్లిందో ఏమో" అంది తల్లి ముక్కుసీదుతు.

"అప్పటి వరకు పిల్లలను తీసుకుపోదం. మూడు రోజులకే మురికి మురికి అయింద్రు" అంది తల్లి గుడ్ల నీరుపెడుతూ.

"బాబూ నీ యింటికి నా కూతురును ఎట్లా ఒప్పచెప్పామో తిరిగి మాకట్ల ఒప్పచెప్పు. ఆ తరువాత ఆలోచిద్దాం" అన్నాడు తండ్రి దుఃఖం నిండిన గొంతుతో.

"నేను ఏ అన్యాయానికి పాల్పడలేదు. నాకు ఏ అన్యాయం జరుగదు. ఆమె తప్పక వస్తుంది" అన్నాడు గోపాల్ వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటు.

ఇద్దరు పిల్లలను తీసుకుని అత్త-మామ అక్కడినుండి కదిలారు. వాళ్లతోపాటే అందరు కదిలారు. ఆ సావిత్రి అందరు పోయిందాక ఆగి "గోపాల్ అంతటా చూసావా?" అని అడిగింది ఆవిడ పోతుపోతు యావతో తిరిగొచ్చి.

ఎందుకో గోపాల్‌కు వాళ్ళు అడుగుతుంటె చికాకేసింది. ఇంత పట్టింపు వీళ్ళకెందుకో అని కోపం వచ్చింది, అయినా దిగమింగుకుని, 'చూసాను' అన్నట్టు మౌనంగా తలాడించాడు.

"ఇంతకు ముందెప్పుడైనా ఇల్లు విడిచిపోయిందా" అని అడిగింది.

అప్పుడతనికి కత్తితో ఎదలో పొడిచినట్టనిపించింది.

"ఏ స్త్రీ అయినా, ఏ పురుషుడైనా ఇంటికొచ్చేదా?" అనికూడ అడిగింది. అప్పుడతనికి తల నరికేసినట్టనిపించింది అయినా 'లేదు' అన్నట్టు తలాడించాడు.

"అవును రోజు డ్యూటికిపోతవుగ" అని అడిగింది.

అతను మాట్లాడలేదు. కాని ఆ మాటలు మేకుల్లా గుచ్చుకుంటున్నయి.

"ఏదైనా ఒక్కరోజునే కాదు ఎన్నో రోజుల ప్రయత్నం వుంటుంది. నీకెప్పుడైన అనుమానం వచ్చేటట్టు ప్రవర్తించిందా?" అని నిర్భయంగా అడిగింది.

గోపాల్ తట్టుకోలేక గొంతు పట్టి పిసకాలనిపించింది. తనను తాను కంట్రోల్ చేసుకుంటు "ఇక మీరు నన్ను ఒంటరిగా వదిలేయండి" అంటు చేతులు జోడించాడు.

"ఏదో తెలుసుకొందాం అని అంటె అంత కోపమా" అంటు బయటకు నడిచింది.

గోపాల్‌కు పిచ్చెక్కినట్లయింది. నలుగురు నాలుగుమాటలు, నాలుగు రకాల చూపులు, 'వీళ్ళలాగ నా సీతను కూడ అనుకుంటున్నారా? అట్ల ఎప్పుడు కాదు కాబోదు' అనుకున్నాడు. అత్తమామ అనుమానం గుండెలో గుచ్చినట్టయింది మనస్సు విలవిలలాడింది. ఏతల్లి తండ్రయినా అట్లా అనుకోవటం సహజమే అయినా తాను అట్లా చేయలేదే. పిల్లలిద్దర్ని తీసుకపోవడం ఎంత బాధ!

సీతా నీవు ఎక్కడ పోయావు. ఒక్కమాట నాతో చెప్పి పోవచ్చుగ. నిన్ను నేను అంత బాధపెడితె భరించలేను అని నీ తల్లిగారింటికి పోవచ్చుగ. నా పిల్లలను అనాధలను జేసిపోతివా? ఎవరన్నా కిడ్నాప్ చేసిరా? నా దగ్గర ఏముందని నిన్ను కిడ్నాప్ చేసి నన్ను బ్లాక్‌మేల్ చేస్తారు. మనమే లక్ష అప్పుచేసి నానా అవమానాలకు గురి అవుతున్నాం. ఈ అప్పులను ఎట్లా తీర్చుదామండి. కాన్పు కాన్పుకింత ఆయె. రోగాలు నొప్పులకింతాయె. వాటి మిత్తి పెరిగి రెండింతలాయె. ఎట్లా దీర్చేది అని ఎన్నోసార్లు సంసారం గురించి నాకె ధైర్యం చెప్పిందానివి ఎట్లపోతివి. నలుగురు నాలుగు మాటలంటువుంటె ఎట్లా భరించేది. ఈ పరిస్థితి పగవానికి గూడ రాగూడదే. పెండ్లాం ఇల్లొదిలి పోయిందంటే ఎంత అప్రదిష్ట. బ్రతికి ఏం ప్రయోజనం అనుకున్నాడు. చనిపోయిన తల్లి-తండ్రి గుర్తొచ్చారు. దూరందేశంలో వున్న అక్క గుర్తొచ్చింది. ఇంకా చుట్టుపక్కాలు గుర్తుకొచ్చారు.

00

అత్తమామ మరోనాడు మళ్లీ వచ్చారు. వస్తు వస్తు పోలీసులను తీసుకొచ్చారు.

గోపాల్ ఆఫీసుకు వెళ్లకుండా ఆరోజు ఇంటిదగ్గరే వున్నాడు. భార్య వెళ్ళిపోయినంక ఆఫీసుకు ఏం ముఖం పెట్టుకుని పోవాలి అనుకుంటు ఓ పూట పోయినట్టు ఓపూట పోనట్టు పోతువున్నాడు.

వాడలోని జనం 'పోలీసులొస్తున్నరు పోలీసులొస్తున్నరు' అని గుసగుస చెప్పుకుంటున్నరు.

"పాపం గోపాల్‌ను తీసుకపోయి కొడతరో ఏమో" అంది ముసలావిడ.

"పోలీసుల చేతులబడ్డంక ఊకె వదిలిపెడ్తర" అన్నాడు పక్కన్నే కట్టెను గదమకింద పెట్టుకున్న ముసలాయన.

చేతిలో లాఠీతో వస్తున్న పోలీసులను చూడగానే గోపాల్‌లో ఓ మాదిరి భయం మొదలైంది. అయినా చేసేదేముంది అనుకున్నాడు. వాళ్ళు దగ్గరికొచ్చి -

"ఏమయ్య నీపేరేనా గోపాల్" అన్నాడు హెడ్ కానిస్టేబుల్

'అవును' అన్నట్టు తలాడించాడు. మూడు నాలుగు రోజులనుండి సరిగా తిండిలేక ముఖం గుంజుకపోయింది. గడ్డం గూడ గీసుకోలేదు.

"ఏది నీ భార్యను పిలువు" అన్నాడు హెడ్.

ముఖానికి చేతులు పెట్టుకొని గోపాల్ భోరున ఏడిచాడు.

"భార్యను పిలువు అంటె ఏడుస్తావేంటి. ఏడిచే మొగోన్ని నమ్మరాదట" అన్నాడు.

"లోపల చూడవయ్యా పి.సి." అన్నాడు.

పి.సి లోపలికెళ్ళి చూసాడు.

వంట చేయని వంటరూమ్. గూట్లో సోపు డబ్బా, కారం, జాడి, ఉప్పు పాకెట్, టీ పొడి పాకెట్, వున్నాయి. కింద కడగని పాత్రలు, చిందరవందరగ పడివున్న గుడ్డలు, పిల్లలు రాసుకునె పలకాబలపం. ఇడిచిన బట్టలు, నిండుకున్న బియ్యపు డబ్బా, అట్టపెట్టెలో ఉతికిన బట్టలు ఉన్నాయి.

"ఎవరు లేరు ఏం లేవు సార్" అన్నాడు బయటకు వస్తు పి.సి.

"విషం తాగిన గిన్నెలు, గొడ్డలి, కత్తి ఏమి లేవా?"

లేవు అన్నట్టు తల అడ్డంగా కదిలించాడు.

"ఫ్యానుందా, దానికేమన్న తాడు చీర వేలాడదీసినట్టు వుందా"

'లేవు టేబుల్ ఫ్యాన్ వుంది, అంతె" అన్నాడు.

"కిరోసిన్, వగైరా, నేల, తలుపులు ఏమన్న కాలి పొగసూరి వున్నాయా?"

"హు హు" అన్నాడు.

"గదిలో ఏమన్న గోతితోడినట్టుందా, బండలు తీసినట్టు, వేసినట్టు వుందా" అని అడిగాడు.

"అసలు బండలేసిన ఇల్లుకాదు సార్ మనం నిలుచున్న గదిలాగె మట్టితో అల్కివుంది అది కూడా చాలారోజుల కింద అల్కినట్టుంది సార్" అన్నాడు పి.సి.

"ఆయన మర్డర్ చేసి ఇంట్లో ఎందుకు వుంచుతడు, ఏ బాయిలోవేసాడో, ఏ కంపచెట్లల్లో వేసాడో" అని గోపాల్‌వైపు మళ్ళి "చెప్పర కొడకా చెప్పు కుక్కల్ని తెప్పిస్త, మక్కెలిరగతంతే అప్పుడు నువ్వు చెపుతవు, నీ తండ్రి చెపుతడు" అన్నాడు హెడ్

"మాస్టారు, వీడు ఇట్లా చెప్పడు, నాలుగు తగిలిస్తేగాని చెప్పడు పదరా పద స్టేషన్‌పద" అన్నాడు మామ.

గోపాల్ మామవైపు మళ్ళి "నేను ఏ పాపం ఎరుగను సీతను చంపవల్సిన అవసరం నాకెమొచ్చింది మామగారు. ఎటుపోయిందో, ఎందుకుపోయిందో తెలియక నేనే చస్తున్న. దావఖానలో కనిపించిందని ఒకరు, సినిమా దగ్గర కల్సిందని మరొకరు చెపుతున్నరు. రెండు రోజులు ఆగితే రావొచ్చు". అన్నాడు గోపాల్ ఏడుస్తూనె.

"ఇక్కడికి మూడు రోజులైపాయె ఇంకెప్పుడొస్తది" అని అడిగిండు మామ.

"అసలు ఆమె పోవలిసిన అవసరమేలేదు. అప్పు చేస్తె నేను చేసాను, నానా తిప్పలు పడి ఈ రోజుకాకుంటే రేపు నేనే తీర్చుకుంటాను." అన్నాడు.

"సరె స్టేషన్‌కురా యస్.ఐ.గారిని రెండు రోజుల గడువు అడుగు. ఈలోపు వస్తె ఏం లేదు రాకుంటె నిన్ను బొక్కలో తోయవలసి వుంటుంది" అంటూ అక్కడినుండి కదిలి స్టేషన్‌వైపు నడిచారు.

జనమూ కదిలారు.

00

పోలీసు వాళ్ళ మాట ప్రకారం మరునాడు కూడా పోలీస్ స్టేషన్ వెళ్లాడు. అతనిని చూడగానె యస్.ఐ. "ఏమోయి వచ్చిందా నీ పెళ్ళాం" అని అడిగాడు.

'రాలేదు' అన్నట్టు తల అడ్డంగా తిప్పిండు.

"ఆమె ఎంత వరకు చదివింది"

"టెన్త్ వరకు"

"ఉత్తరం రాయలేదా?"

"రాయలేదు"

"ఏ జాడ తెల్వలేదా?"

'లేదు' అన్నట్టు తలూపాడు.

"మరేం చేసినవు"

"నేను ఏ పాపం ఎరగనుసార్" చేతులు జోడిస్తూ.

"మీ ఇంటి పక్క ఇంట్లో వుండే ముసలమ్మ వుందా?"

"ఆమె కూడ కనబడతలేదు సార్"

"ఆమె ఎక్కడికి పోయిందో తెలుసా"

"తెలవదు"

"మరేం తెలుసు బే నీకు"

"ఆ ముసలమ్మ పోయిగూడ ఈవాలిటికి నాలుగు రోజులు"

"అయ్యో"

"ఆమె కొడుకు యాడుంటడు" కుర్చిలో వెనకకు వరిగి కూర్చొని టెబుల్‌మీది పేపర్ వెయిట్‌ను గిర్రున తిప్పుతూ అడిగాడు.

"పట్నంల" చేతులు కట్టుకుని వినయంగ అన్నాడు.

"అబ్బె మరి పట్నంపోయి చూసొస్తివా"

'లేదు' అన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

"ఎక్కడబోయి చూడకుంటే పోయిన పెండ్లం ఎట్లొస్తది. ఇంకెవ్వనితోటన్న సంబంధం వుండెనా"

ఆ మాట అడిగేసరికి గోపాల్‌కు కొరడాతో కొట్టినట్టనిపించింది. అయినా భరించక తప్పలేదు.

"ఈపూట పోయి ముసలమ్మ కొడుకు ఇంటికాడవుందో ఏమో చూసిరా నడువ్" అన్నాడు యస్.ఐ.

గోపాలు బిక్కుబిక్కుమంటు పోలీస్ స్టేషన్ మెట్లుదిగి ఇంటిబాటన నడుస్తువుంటె జనం తనవైపు అదోరకంగా చూడడం, ఏమోమో గుసగుస అనుకోవడం ఎంతో బాధకల్గిస్తువుంది. కళ్ళనిండా నీరు కమ్ముకొని బాట మసకమసకగా కనిపిస్తూవుంది.

00

గోపాల్ అత్తమామ ఇంట్లో బిడ్డగూర్చి అంగలార్చుతు కూర్చున్నారు. జనం ఒక్కొక్కరె వచ్చి తమకు తోసిన మాట అని పోతువున్నరు. ముసలమ్మ, సీతమ్మ కలిసి వెళ్ళిన సంగతి ఊరంతా క్షణంలో తెలిసిపోయింది.

"ఏ కొంపకు తీసుకుపోయిందో" అంది సావిత్రి.

"అది అట్లాంటిది కాదులేవే నీవు మరీను" మరొకావిడ అంది.

"డబ్బు అన్ని పనులు చేయిస్తది. పైసలాశకు పాణాన్నె అడ్డుపెట్టె రోజులివి. అరగని కరగని ఆనవాలుకూడ కానరానిపనాయె ఇది" అంది సావిత్రి.

"అందరు నీలాగుంటరా ఏంది పాపం సీతమ్మ అట్లాంటిదికాదులే"

"మరెక్కడికి పోయినట్టు చెప్పకుండ చెయ్యకుండా" అంది చేతులు తిప్పుకుంటు

"అది తెల్వకనె కదా ఈ అవస్థ"

"నీ వేమన్న అను ముసల్ది వయసులో వున్నప్పుడు ఏం చేయలేదంటవా"

"ఏం చేసిందో మనకేమెరుకదాని బిడ్డల వయస్సు మనది"

"సేసిన మనిషికాంది నన్నోసారి తనింటికి పిలుచుకుపోతుందా?" మెల్లగ చెవిదగ్గర అంది సావిత్రి.

పిలుచుకు పోయినంక ఏమైంది అన్నట్టు చూసింది. సుశీల కుతుహలంగా "ఏమైతది గదిగూడ చెప్పాలనా" మూతిమీద వేలేసుకుంటూ అంది.

"మరి ఆడెవడు" అని అడిగింది సావిత్రి కళ్ళలోకి యావగా చూస్తూ.

"అదె ఆ తిరుపతమ్మ తమ్ముడు మిలిట్రి నుండి రాలె, ఆడు"

"అవును వారం పదిరోజులున్నడు." అంది ఎంతో కుతుహలంగా.

"వుంటె ఏం లాభం ఇచ్చేది తక్కువ, గిచ్చేది ఎక్కువ" అంది సావిత్రి ఒకింత ఈసడింపుగ.

సుశీల ఆమాట విని మెల్లగ నవ్వింది. సావిత్రి నవ్వింది. ఆ తరువాత సుశీల నర్మగర్భంగా చూసింది సావిత్రి ముఖంలోకి.

'ఏమిటి' అన్నట్టు సావిత్రి చూస్తూ తన తల సుశీల తలదగ్గర్కి వంచి, నిలుచుంది. అప్పుడామె చూపు సుశీల వేసుకున్న గాజులమీదుంది.

"ఆదువచ్చినపుడె తిరుపతమ్మ నా దగ్గరికొచ్చి" మా తమ్ముడు రమ్మంటుండు మిలిట్రిమందు తెచ్చిండు నీకు దావతు ఇస్తడట" అంది ఇంటికొచ్చి.

"ఆ తరువాత ..." అంటున్నప్పుడె పట్నం పోయిన గోపాలు తలవంచుకుని ఇంట్లోకి నడిచాడు. వాకిట్లో మాట్లాడుతున్న జనం మాట్లాడటం ఆపేశారు.

"పాపం గోపాలుకు ఎన్ని కష్టాలొచ్చె" అంది సావిత్రి. ఆ మాట వొట్టి మీది మాటేగాని మనస్పూర్తిగా అన్నదికాదు.

"ఏం కష్టాలోగాని ఏమైందో కొడుకు దగ్గర తిరుపతమ్మ కల్సిందో" అనుకుంటున్నప్పుడు పక్కింటి ఎల్లమ్మ వచ్చి -

"తిరుపతమ్మ కొడుకు దగ్గర్కి కూడ పోలేదట కదా?" అంది ఓ మాదిరి విచారంగా.

'మరి ఎటు పోవచ్చు' అన్నట్టు చూసింది సుశీల.

"నేను చెప్పలే డబ్బుకోసం ఏ కొంపకో తీసుకుపోయి వుంటది" నిశ్చయంగా అంది. అప్పుడామె కుడిచేయి గదమకిందికొచ్చి ఎడమచేయి నడుముచుట్టు పరుచుకుంది. ముఖంమూడు వంకర్లు తిరిగింది. చెడిపోయిన వాళ్ళకు ఇతరులు తమలాగె చెడిపోయింర్రని తెలిస్తే సంతోషపడుతుంటరెందుకో.

"ఈ సంగతి విన్నావా, పుట్టపర్తిలో అమెరికోల్లొచ్చి, ఇక్కడోల్లను పెళ్ళిచేసుకుంటుంరంట, అడిగినంత డబ్బిస్తుంరట" అంది సావిత్రి గుసగుసగా.

"పేపరుకొచ్చిందిగా, రెండు రోజులకే వదిలిపెట్టి పోతుంర్రట"

"డబ్బు దక్కుతుందిగ" అంది సావిత్రి.

"సీత ఉన్నా లేకున్నా సంసారాన్ని సక్కదిద్దుకుంది. కాన్పులకైన ఖర్చులు అప్పులై తిప్పలు పెట్టినయి. ఇచ్చినోళ్లు వచ్చి అడుగబట్టిరి. గోపాలు తట్టుకోలేక సీతను సాధించేది. అయినా మొగడంటే ఎంతో ప్రేమగా సంసారం చేసింది. ఇంట్ల మాట బైటపెట్టలేదు. ఆకరికి చెప్పకుండ పోయి ఇంతకాడికి తెచ్చె" అంది ఎల్లమ్మ. ఆమె కూరగాయల బేరం చేస్తది. దాదాపు ప్రతి ఇంటి సంగతి తెల్సివుంటుంది ఆమెకు.

"తిరుపతమ్మ వస్తెగాని అసలు సంగతి తెలవదు" అంది సుశీల.

"ఏం తెలుస్తదో ఏమో" అని పెదవులను వంకరగా తిప్పి వొదిలింది సావిత్రి.

00

సాయంత్రం తిరుపతమ్మ రిక్షా దిగింది. సంకలో సంచి, చేతిలో వెంకటేశ్వరుని బొమ్మ. అది మెడనుండి కిరీటం వరకుండీ నుదుట నామాలతో మెరిసే కిరీటం. తాను వొస్తువుంటె జనమంత ఓ మాదిరిగా ఎందుకు చూస్తుంద్రో అర్థం కాలేదు. గోపాల్ ఇంటిముందు నిలుచున్న వాళ్ళంతా ఆమె రాకను అదో మాదిరిగా చూడడం ఆమెకేదో అనుమానాన్ని కల్గించింది. ఆమె వచ్చిందని తెలవగానె గోపాలు ఆదుర్దగా వచ్చి

"సీతేది" అని అడిగాడు.

"నాకేమెరక" అంది తాళం తీస్తు.

గోపాల్ ఒక్కసారె స్థంబించిపోయాడు. ఇప్పటివరకు తిరుపతమ్మ వెంట పోయింది. ఇద్దరు కలిసివొస్తరు అనుకున్నాడు. ఒక్కతెవచ్చి తనను సముద్రంలోకి నెట్టేసినట్టుంది. సీత ఎటు వెళ్లొచ్చు? తిరుపతమ్మ సామాను ఇంట్లో పెట్టి ఓ కాగితంలో లడ్డూను తుంపి బయటకు తెచ్చి వాకిట్లో ఉన్నవాళ్ళందరికి పంచింది.

"దేవుని దగ్గరికి పోయొచ్చి చెపుతున్న నీ భార్య క్షేమంగ తిరిగొస్తది. ఏం బాధపడకు" అని తాను తెచ్చిన నల్లదారం అతని ముంజేతికి కట్టింది.

"నువ్వు సీత కల్సి ఒకే బస్సులో పోయింద్రట కద" అడగలేక అడిగాడు.

"పోయిన మాట నిజమే" అని ఆగింది.

"ఆ తరువాత" గోపాల్ ఆతురతగా అడిగాడు.

"నేను నార్కట్‌పల్లిలో దిగి నా బిడ్డ దగ్గర్కిపోయిన ఆమె అట్లనే అదే బస్సుల పట్నం పోయింది" అని ఆగింది.

"పట్నంల ఎవరున్నరని పోయింది" అడిగాడు గోపాల్.

"ఏదో సూర్య దావకానకు పోత అని పోయింది"

"ఎందుకట"

"నీకు చెప్పనేలేదా"

"చెప్పలేదే"

"మనిషికి రెండు కిడ్నీలుంటాయటగ, ఒక్కటున్న బతుకొచ్చట గద"

"అయితె"

"ఒకటి అమ్ముకొస్త అని చెప్పనేలేదా" అని కాసేపు ఆగి

"ఆడికి నేనడిగిన గోపాలుకు చెప్పొచ్చినవా అని, 'ఆ' అని తలవూపింది. నేను నిజమే అనుకున్న" కుడిచేతి వేళ్ళను నోరుమీద వుంచుకుంటు, ఎంతపనిచేసింది! అన్నట్టు చూస్తూ.

"నాకు చెప్పలేదు తల్లో" అంటు బోరున ఏడుస్తూ గోడకు జారగిల పడ్డాడు.

గంట తరువాత మరో రిక్షా ఇంటివైపు వస్తువుంది.

"సీత వస్తుంది" అనగానే అందరు అటువైపే చూస్తువున్నారు. గోపాల్ గదిలోనే మోకాళ్ళ మీద తలను ఆనించి 'ఎంత పనిచేసింది' అని ఆలోచిస్తువున్నాడు.

రిక్షాలో వస్తున్న సీత ముఖం గుంజుక పోయివుంది. తైల సంస్కారం లేని తల చిందర వందరగా వుంది. తన పిల్లలు ఎట్లవున్నరో తొందరగా చూసుకోవాలన్న ఆతురత ఆమెలో కొట్టిచ్చినట్టు కనిపిస్తుంది. ఇంటిముందున్న జనాన్ని చూసి రిక్షా దిగి, రిక్షావానికి దబ్బులిచ్చి అందరివైపు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో ఇంట్లోకి నడిచింది. సంచిని గడపలోపల వుంచి ఏడుస్తూ పొద్దున్నె అమ్మమ్మ వాళ్ళ ఊరినుండి తిరిగొచ్చి ఎదురొచ్చిన పిల్లలిద్దర్ని తన బుజాలకు అదుముకుంది. సంకలోని సంచి జారి కిందపడి అందులోవున్న వస్తువులు నేలమీద పొర్లినయి. అవి డాక్టర్లు రాసిన చీటీలు, సగం వాడిన మందుల సీసాలు, బ్యాండేజి క్లాత్ చుట్టలు, పిల్లలకోసం బిస్కెట్ ప్యాకెట్స్. ఈలోపు జనం 'ఫెటుపోయినవు తల్లి' అన్నట్టు చూస్తువున్నారు.

ఇల్లంతా మందుల వాసన. రవిక కింద నడుం భాగంలో వెనుక వెన్నెముఖ నుండి బొడ్డువరకు బేండేజి వుంది.

గోపాల్ తలవంచుకొని తన పాదాలను తానెచేత్తో రాసుకుంటున్నాడు.

సీత దగ్గరికి వెళ్ళి అతని ముఖాన్ని తన దోసిల్లోకి తీసుకుని "ఇక మనకు అప్పుండదు" అంటూ నడికట్టున వున్న నోట్ల కట్టలను భర్త వల్లో వుంచింది.

అక్కడ నిలుచున్న జనం ఒక్కసారె బరువైన శ్వాస వదులుతూ కదిలారు.

పోలీసు స్టేషన్‌కు పోయివచ్చిన తల్లితండ్రులు బిడ్డను కౌగిలించుకుని ఏడుస్తువున్నారు తప్ప వాళ్లకు మాటలు రావటంలేదు.

సీతకు మాత్రం ఏడుపు రావటం లేదు. చూపులు మాత్రం లోతుగా ఆలోచిస్తున్నట్లున్నాయి. 'నాటిన మొక్క వేర్లుపోసి ఏమనుకుంటుంది లేనిది చూడాలి నాన్న' అనాలనుకుంది కాని ఎంతైన కనిపెంచిన వాళ్ళుకదా అని ఆగిపోయింది.

• 2002